# మంచిగతమున కొంచెమేనోయ్

"ఈ చెంబెంతకు కొన్నారు సార్?"

"టూ యైట్ 1948 లో జస్ట్ యుద్ధం ముగిశాక మా అమ్మ కొంది."

"ఇప్పుడెంతో తెలుసా! టెన్ రుపీస్...." అవతలాయన నోరు వెళ్ళబెట్టి అప్పుడే ఒక రెండు డజన్లు చెంబులు కొని వుండాల్సింది అన్న అభిప్రాయం వ్యక్తంచేసి- "ఇప్పుడు టెన్‌రుపీస్ పెట్టి కొనడమే గాని ఆ నాణ్యం ఆ గట్టి ఏదండి" అని నాలుక చప్పరిస్తాడు.

అప్పుడు మన చెంబుకి "చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా" అని అనాలనిపిస్తుంది.

## పాత పెన్ను

"ఈ పెన్ను చూశారా?" అంటారు వెండి కట్టు వేసుకున్న డొక్కు కలం తీసి చూపిస్తూ.

"ఏదేది? ఓహోహ్హో.... ఏం కలమండీ, ఇప్పుడలాంటి కలాలు లేవండి. అహ్హా....చూడ్డానికి డొక్కు కలంలా కనిపిస్తోంది కాని ఏం సన్నగా, నాజూగ్గా రాస్తుందండీ? ఎప్పుడు కొన్నారు!"

"నేం కొన్లేదు, మా ఫాదర్ ఫస్టు ఫారం చదివేపుడు కొన్నార్ట. ఆరోజుల్లో టూ యైట్...."

"అబ్బబ్బ.... చెప్పకండి, ఆరోజుల్లో టూ యైట్ అంటే యిప్పుడు ట్వంటీ యైటన్నా వుంటుంది. ఏదీ ఒకమాటు రాసి చూడ నివ్వండి."

రాణీ యసన్ మధురవాణె రాణులలో నన్ అన్నట్లు "ఏం కలమండీ? పేరు చెప్పారుకాదు."

"వాటర్‌మన్స్.... యిప్పు డిలాంటి సరుకు రావటంలేదు. మా గ్రాండ్ ఫాదర్ మా ఫాదర్‌కి కొనిచ్చారు. మా ఫాదర్ నాకిచ్చారు. రాయడం మొదలెడితే నాన్‌స్టాప్.... సిరా కేవలం నిమిత్త మాత్రం, చదువక్కర్లేదు."

జాగ్రత్త-ఎవరేనా కొట్టేస్తారు."

"అదే భయమండి నాకు. ఈ వెండి కట్టుంది చూశారూ నాయ నమ్మ కంసాలికి చెప్పివేయించింది."

"మీ నాయనమ్మ జిందాబాద్ !"

ఆ డొక్కు కలాన్ని చూసి మురిసిపోతూంటారిద్దరూ.

## బ్లేజరు కోటు

"ఈ కోటు చూశారా? ముక్కు పొడుం రంగు ..."

"అహ్హాహ్హా ఏదీ.... ముట్టుకు చూడనివ్వండి ఏం సొగసు! ఎంత మెత్తగా వుంది? ఎంతకు కొన్నారు?"

"కొన్లేనండి మా అంకుల్ మ్యారేజికి 1938వ సంవత్సరంలో పోలెండుమీద జర్మనీ వాడు దాడి చేశాకో, చేసేముందో కుట్టించారుట, పొట్టయితే నాకిచ్చారు. ఆరోజుల్లో ఫిఫ్టీన్ రుపీస్ అయిందిట."

"అహో ఆరోజుల్లో ఫిఫ్టీన్ అంటే యిప్పుడు పది రెట్లన్నా పెరిగుంటుంది దీని వాల్యూ.— హండ్రెడ్ ఫిఫ్టీ అన్నా వుంటుంది జాగ్రత్త.... మళ్ళీ కొన్లేరు."

"అందుకే ఎప్పుడన్నా వేసుకుంటూ వుంటాను. లోపల లైనింగ్ చూశారా?" అని కోటు తిరగేసి చూపిస్తూ వుంటారు.

"అహ్హా- ఏవి లైనింగండీ? ఇప్పుడీ లైనింగుకే కుట్టించడానికే ఫిఫ్టీ రుపీస్ అవుతుందండి."

"నా వైఫ్-యీ లైనింగు వూడదీసి జాకెట్టు కుట్టించుకుంటా నంటోంది."

"నో.... నో.... వద్దండి. మరొక పదేళ్ళు ఆగమనండి. ఈ కోటు తొడుక్కుంటే మీరు చాలా గౌరవంగా కన్పిస్తారు."

"ఆ కోటు తొడుక్కోనివ్వదండీ నా వైఫ్.... విప్పకపోతే తల బద్దలు కొట్టుకుని పాదాల చెంత చచ్చిపోతానంటుంది."

"పూర్ క్రీచర్స్.... ఓల్డు యీజ్ గోల్డని వాళ్ళకి తెలీదు. ఆవిడ ఊరుకెళ్ళినపుడు బైటకు తీసి ఆ వెండి చుట్టు కలం జేబులో పెట్టుకుని వూరంతా ఓ రవుండు కొట్టిరండి."

"నా కల్లాగే వుంటుంది.... ఈ టేబిలు చూశారా ?"

## పనస చెక్క టేబిల్

"ఏం టేబిలండీ- యిది విరుగుడు చావా ?

"విరుగుడు చావ కాదండీ.... అట్టే అనిపిస్తోంది మీ కళ్ళకి."

ఆ వచ్చినాయన టేబిలు కేసి బిక్కమొహం వేసుగుచూసి. "ఆహా ఇనుం వుక్కలాగుందండీ'' అని ఓ గుద్దు గుద్ది చేయి నొప్పెట్టింది కాబోలు ". ఇది ఏ సెంచరీలో చేసి వుంటారు ? గ్రీక్ కల్చరా- రోమన్ కల్చరా !''

''అబ్బే- మా గ్రాండ్ ఫాదర్ టూ రుపీస్ యైట్ అణాస్‌కి చేయించాట్ట...."

ఆ వచ్చినాయన మూర్ఛ నుంచి తేరుకుని ...

"తమరు వేళాకోళ వాడుతున్నారు .... .... అన్నీ టూ రుపీస్ యైటనాసేనా ?"

"ఒట్టు.... మా నాయనమ్మ ఎక్కువిచ్చారని మూడ్రోజులు మా తాతయ్యతో దెబ్బలాడేపిందట.''

"వండర్‌ఫుల్.... ఈ టేబిల్ అప్పటిది కాబట్టి యింకా యిలా చెక్కు చెదరకుండా వుంది. దీన్ని నేషనల్ మ్యూజియంకుగానియిస్తే థవుజండ్స్ ఆఫ్ రుపీస్ వస్తాయ్.''

''నాకు థవుజండ్స్ మీద ఆశ లేదండీ. మీరు నమ్మరు. ఇది కేవలం పనసచెక్క - మా తాత తోటలో పనస చెట్టు కొట్టించి దీన్ని చేయించాడు.''

"పనస చెట్టు ఎందుకు కొట్టారు?''

''అది బురద పనసట.''

''వ్హాట్ బురద''

''అంటే పండంతా పీచే, తొనలు గింజలు పీలగా సన్నగా వుంటాయి.''

"కూరకు పనికొస్తుందనుకుంటాను.''

"మా గ్రాండ్ ఫాదర్ పనసకాయలందరికీ దానాలు చేసేవాడ్ట, కూరొండుకు తినండర్రా మీ మొహంమండా అంటూ-"

''అబ్బ నాకు పనసకాయ కూరంటే చెడ్డ లైకింగ్.''

"నా వైఫ్ పనసకాయ కూర ఎక్సలెంటుగా చేస్తుందండి."

''మీకు పనసకాయ చెక్కడం, పొట్టుకొట్టడం వచ్చా?''

''ఐ డోంటో్న-''

"నా వైఫ్ నాకు నేర్పిందండి— అఫ్‌కోర్సు, మొదట్లో ఏడుపొచ్చేది. ఆ కత్తిదాన్ని పనసకాయకత్తి అంటారట. వాళ్ళ నాన్ననడిగి తెచ్చుకుందిట. ఆ కత్తిపట్టుకుని పుట్టింటినుంచి వచ్చేసరికి నేను దాన్ని చూసి దడుసుకున్నాను."

"ఏదండి ఆ కత్తి?"

''ఇదిగో చూడండి....''

''అబ్బ! ఏం కత్తండి? ఈ రోజుల్లో యిలాటి కత్తుల్లేవండి— ఒహ్హో! అహ్హా.... ఎంతవుంటుంది దీని ఖరీదు?''

"పోరనాస్...."

మళ్ళీ మూర్ఛపోయాడు ఆ వచ్చినాయన.

''అబ్బ.... ఆ రోజుల్లో వుంటే కత్తులవ్యాపారంచేసినా బాగుపడి పోయేవాళ్ళమే.... కత్తుల్తో చీప్‌గా కత్తులవంతెన కట్టుకోవచ్చు."

''ఓ మాటిస్తారా మా ఆవిడకు చూపిస్తాను."

''సారీ- మా ఆవిడ పనసకాయకత్తి ఎవరికీ యివ్వనివ్వదండి."

"ప్చ! సర్లెండి. మీరుమటుకు ఏంచేస్తారు.?"

అద్దమేలంటాది అందాలు తెలుప

''ఈ అద్దం చూశారా!"

''అబ్బ ఏవి గ్లాసండి.... మీ వైఫ్ తెచ్చారనుకుంటా- ఈ ఫ్రేం ట్వంటీ రూపాయలుచేస్తుంది."

''నా వైఫ్ తేలేదు."

"మరెక్కడ్నుంచి కొట్టుకొచ్చారు దీన్ని?....''

"కొట్టుకు రాలేదు. మా అమ్మ మెడ్రాస్‌లో 1928లో దీన్ని మూడు రూపాయలకు కొంది."

''త్రీరుపీస్.. అబ్బ యిప్పుడు త్రీ రుపీస్‌కి (అరచేయి చూపిస్తూ) యింత అద్దం దొరికితే నేను బెట్ చేస్తాను. ఏవి దళసరి, ఏవి నాణ్యం— అబ్బ చెప్పకండి. నాకు ఫిట్సొచ్చేలాగుంది."

''మొన్న మావాళ్ళు ఇలాటి అద్దం కొనాలని ఇండియా అంతా గాలించారు. దొరకలేదు. ఆఖరికి దీన్లో సగం సైజుది సిక్స్టీ రుపీస్‌కి కొన్నారు."

''అవ్వాలసిందే లెండి వాళ్ళకి. తెగులు కుదిరివుంటుంది. పోతే దీన్తో పోటీ యేమిటి!"

* * * *

"రోజులు బావులేవు" అని పరమ డేంజరస్‌గా ధ్వనిస్తూ మా తారుకాని ''ఈ రోజులు మంచివని "ఎవరూ అనరు. ఈ రోజుల్లో

పడుతున్నావని ఎవరూ ఒప్పుకోరు. "మంచి గతమున కొంచెమేనోయ్" అని అప్పారావుగారు బల్లగుద్ది చెప్పినా "అమరావతీపట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయము స్థాపించునాడు" అని పాతగొప్పలు తవ్వుకోడం మన వాళ్ళు మాన్లేదు. మనకి పాస్ట్ టెన్సేగాని ప్రజంటెన్స్ లేదు.

1948లో యీయన్ని 500రూపాయల కట్నం యిచ్చి చేసుగున్నా నంటుందనుకోండి ఒక శ్రీమతి. మనవాళ్ళు "అయ్యో ఈ రోజుల్లో 5 వేలు, పదివేలుపోసి (ఒకడ్ని చేసుకునేకంటె ఆ రోజుల్లోనే అయితే పదిమందిని చేసుకోడంకాదు)పదిమంది పెళ్ళిళ్లచేయగలిగివుండేవాళ్ళం" అని వాపోతూంటారు. మనుషులెందుకోగాని గతాన్ని ప్రేమిస్తూ, ఈ రోజుల్ని గురించి ఆలోచించరు. వర్తమానవంటే చీదరించుకుంటారు. భవిష్యత్తు అంటేభయం.. మరి యీ స్పుత్నిక్కులూ, జెట్ విమానాలూ, వైజ్ఞానికప్రగతి, టెలివిజన్, రేడియో, ఆధునికసౌకర్యాలూ మానవజాతి పురోగమనం అంతా పట్టి శుద్దనందుగేనా.... మా యింట్లో ఇత్తడిచెంబు, పాతపెన్ను, బ్లేజర్ కోటు, పనసచెక్కటేబిల్, ఓల్డుమిర్రర్ వీటినితల్చు కుని ఎన్నాళ్ళని పొంగిపోవడం? ఎన్ని నగిషీలు చెక్కినాగోరీలు గోరీలే. నిన్నని తల్చుకుంటూ ఏడవటంకంటె, రేపటిమీద ఆశతో బ్రతకటం మేలు.... ఈవాళ అగ్గిపెట్టి పదిపైసలు.... పాతికేళ్ళలో అది రూపాయి అవుతుంది. ఈవాళ బియ్యం కేజీ రూపాయిపావలా. పదేళ్ళకు ఐదు రూపాయలుకావచ్చు. కాలిజోడు పదిరూపాయలు. పదేళ్ళకు పాతిక రూపాయలు కావచ్చు. అంచేత మనం యిప్పుడు స్వర్గంలో వున్నట్టే లెక్క. మావారి ఫ్రండ్ పనసకాయ కత్తిమీద కన్నేశాడు. ఐ డోంట్ లైక్ హిం— 'టీ' మొహాన్న పోస్తే పోతాడులెండి. ఆ కత్తి యిప్పుడు మళ్ళీ కొనాలంటే ఫైవ్ రుపీసన్నా అవుతుంది.